A-PDF Merger DEMO : Purchase from www.A-PDF.com to remove the watermark




# ప్రజా న్యూస్ నెట్‌వర్క్

నిజం.. సమాజం.. ప్రజా కోసం.. || తెలుగు దినపత్రిక







తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 131,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,శుక్రవారం , తేదీ : 11-09-2026

### రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ 18వ బ్రిక్స్ సదస్సులో

## పాల్గొనడానికి భారత్‌కు వస్తున్నారు.

- రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు హెలికాప్టర్లు ఎందుకు నచ్చవు, ఆయన స్మార్ట్ ఫోన్ వాడకపోవడానికి కారణమేంటి?
- ఢిల్లీలోని భారత్ మండపంలో సెప్టెంబర్ 12నుంచి13వరకు బ్రిక్స్ సదస్సు జరగనుంది.
- నాలుగేళ్ల విరామం తర్వాత పుతిన్ గత డిసెంబర్‌లో ద్వైపాక్షిక సదస్సుకోసం భారత్ వచ్చారు.



ఢిల్లీ: ఈ పర్యటనలో అధ్యక్షుడు పుతిన్, భారత ప్రధాని నరేంద్రమోదీ మధ్య మరో ద్వైపాక్షిక సమావేశం జరిగే అవకాశం ఉందని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ చెప్పారు. పుతిన్ పర్యటనలో ఎప్పటిలాగే ఇరు దేశాలు ద్వైపాక్షిక అజెండాపై చర్చిస్తాయని పెస్కోవ్ చెప్పారు. "మన సహకారం ముందుకు సాగకుండా అడ్డుకోవడానికి కొన్ని దేశాలు ప్రయత్నిస్తున్నందున చాలా విషయాలను బహిరంగంగా చర్చించలేం. అయితే వాటిపై గోప్యంగా, చాలా నిర్మాణాత్మకంగా చర్చలు జరుగుతాయి" అని కూడా పెస్కోవ్ చెప్పారు. మరోవైపు పుతిన్ భద్రతపై మరోసారి చర్చ జరుగుతోంది. పుతిన్ 2000 సంవత్సరం నుంచి అధికారంలో ఉన్నారు. సోవియట్ నియంత జోసెఫ్ స్టాలిన్ తర్వాత క్రెమ్లిన్‌లో ఎక్కువకాలం పదవిలో ఉంది పుతినే. 73 ఏళ్ల వయసులో ఆయన ఐదోసారి అధ్యక్షపదవిలో ఉన్నారు. మిగతా..2లో

### అంతరిక్షం అందరిదీ

### బాధ్యత కూడా సమష్టిగా ఉండాలి




- పారిస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ స్పేస్ సమ్మిట్‌లో మోదీ వర్చువల్ ప్రసంగం
- భారత్ తదుపరి తరం అంతరిక్ష పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాల్లో ఫ్రాన్స్‌తో పాటు ఇతర దేశాలు భాగస్వాములు
- సురక్షితమైన, భద్రమైన, సుస్థిరమైన అంతరిక్ష వ్యవస్థకు భారత్ మద్దతు ఇస్తుందని తెలిపారు.

### భారత్ అమ్ములపొదిలో

## 190 అణు వార్‌హెడ్లు

- ప్రస్తుతం 730 కిలోల వెపన్ గ్రేడ్ ప్లుటోనియం ఉన్నట్లు అంచనా
- 140 నుంచి 225 వార్‌హెడ్లను తయారు చేయవచ్చని వెల్లడి
- భారత్ తన అణ్వాయుధ సామర్థ్యాన్ని క్రమంగా పెంచుకుంటోందన్న అమెరికా



ఢిల్లీ : భారత్ తన అణ్వాయుధ సామర్థ్యాన్ని క్రమంగా పెంచుకుంటోందని అమెరికా పేర్కొంది. 'ఇండియన్ న్యూక్లియర్ వెపన్స్-2026' పేరుతో ఫెడరేషన్ ఆఫ్ అమెరికన్ సైంటిస్ట్స్ డైరెక్టర్ హాన్స్ క్రిస్టెన్సెన్ ఓ కథనం రాశారు. భారత్ వద్ద 190 అణు వార్‌హెడ్లు ఉన్నట్లు అంచనా వేశారు. ఇందులో 160 ఆపరేషనల్ లాంచర్ల కోసం సిద్ధంగా ఉండగా మరో 30 కొత్త క్షిపణుల కోసం ఉత్పత్తి దశలో ఉన్నాయని తెలిపారు. వాణిజ్య ఉపగ్రహ చిత్రాలు, పబ్లిక్ డేటా విశ్లేషణల ఆధారంగా ఈ అంచనాకు వచ్చినట్లు హాన్స్ క్రిస్టెన్సెన్ తెలిపారు. గాలి, నేల, సముద్రం ద్వారా ప్రయోగించగల అణువ్యవస్థలను మిగతా..2లో

### తుమ్మల నాగేశ్వరరావు పనితీరు, వ్యక్తిత్వంపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు




- ఇతర పార్టీల వారికి కూడా మంచి చేసే నాయకుడు తుమ్మల అన్న పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి
- తుమ్మల అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారని ప్రశంస
- ఏ సమస్యపై ఫోన్ చేసినా వెంటనే స్పందిస్తారని కితాబు

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా సేవలు అందిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు పనితీరుపై బీజేపీ శాసనసభ్యులు పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. పార్టీలు వేరైనా ప్రజలకు మంచి చేసే నాయకుడిని, వారి నిబద్ధతను గుర్తించి మెచ్చుకోవడంలో

## రూ.కోటి బీమా.. దేశంలోనే తొలిసారి

- ప్రభుత్వం, ఉద్యోగులపై రూపాయి భారం పడకుండా అమలు
- 12.91 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు వర్తింపు
- ఇప్పటికే 98 క్లెయిమ్‌ల పరిష్కారం
- ఉద్యోగుల కోసం హెల్త్‌కార్డు కూడా తీసుకొచ్చాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




హైదరాబాద్, సెప్టెంబర్ 10 : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పెన్షనర్లకు అందిస్తున్న రూ.కోటి బీమా పథకం దేశంలోనే తొలిసారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రకటించారు. ఉద్యోగి దురదృష్టవశాత్తు మరణించినా అతడి కుటుంబం ఆర్థికంగా రోడ్డున పడకుండా భద్రత కల్పించాలనే మానవీయ ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వంపై, ఉద్యోగులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా బ్యాంకుల సహకారంతో పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాద బీమా, హెల్త్ కార్డుల గురించి సభ్యులు గురువారం అడిగిన ప్రశ్నలకు ఉప ముఖ్యమంత్రి వివరణాత్మకంగా జవాబిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 16 బ్యాంకులతో ఒప్పందం చేసుకుని రెగ్యులర్ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి బీమా కవరేజీ కల్పిస్తోందన్నారు. ఈ మేరకు 2024 జూన్ 26న ఆర్థిక శాఖ 77వ జీవో జారీ చేసిందని, పథకం అమలు విధానం, అర్హతలు, బీమా కవరేజీ, నిబంధనలు, షరతులను అందులో పేర్కొందని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగి కుటుంబానికి రూ.కోటి బీమాతోపాటు ఇతర ప్రయోజనాలు కలిపి రూ.1.20 కోట్ల వరకు ప్రయోజనం అందేలా చర్యలు తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం చెప్పారు.

### త్వరలో ఆర్టీసీ కార్మిక

## సంఘాల ఎన్నికలు



- త్వరలో టీజీఎస్ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికల తేదీపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ అసెంబ్లీలో ప్రకటించారు.
- హైదరాబాద్ వాసుల కోసం కొత్తగా వంద మినీ బస్సులు తీసుకొస్తున్నట్లు కూడా తెలిపారు.
- అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ : గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో టీజీఎస్ ఆర్టీసీ మూసివేసే పరిస్థితి ఉండగా ఇప్పుడిప్పుడే గాడిన పడుతోందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు పొన్నం ప్రభాకర్ సమాధానం ఇచ్చారు. పీఎం ఈడ్రైవ్ కింద హైదరాబాద్ నగరానికి 2,200 బస్సులు రాబోతున్నాయని అన్నారు. టీజీఎస్ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిందని, త్వరలో ఎన్నికల తేదీపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్మిక సంఘాల ఎన్నికలపై మిగతా..2లో

### బంగాళాఖాతంలో అల్పపీడనం - అనకాపల్లి జిల్లాలో దంచికొట్టిన వాన



ఉత్తర బంగాళాఖాతంలో కొత్తగా అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాలపై ఈ అల్పపీడన ప్రభావం ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు వెల్లడించారు.

అమరావతి: : ఉత్తర బంగాళాఖాతంలో కొత్తగా అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకోనున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాలపై ఈ అల్పపీడన ప్రభావం ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు తీర ప్రాంత ప్రజలను, మత్స్యకారులను అధికారులు అప్రమత్తం చేశారు. ఉత్తరాంధ్రకు వర్ష సూచన : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతోంది. దీని ఫలితంగా ఉత్తరాంధ్ర ప్రాంతంలోని జిల్లాల్లో మిగతా..2లో

### తిరుపతివిజయవాడ మధ్య కొత్త విమాన సర్వీసు ప్రారంభం



విజయవాడతిరుపతి విమాన ప్రయాణికులకు మరో సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. గన్నవరం విమానాశ్రయం నుంచి తిరుపతికి ఫ్లై91 నూతన విమాన సర్వీసు ప్రారంభమైంది. విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఈ సర్వీసును ప్రారంభించారు. వారంలో నాలుగు రోజుల పాటు విమాన సేవలు కొనసాగనున్నాయి.

కృష్ణా, సెప్టెంబర్ 10: జిల్లాలో తిరుపతివిజయవాడ మధ్య ఫ్లై91 నూతన విమాన సర్వీసు ప్రారంభమైంది. గన్నవరం విమానాశ్రయంలో విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రిబ్బన్ కట్ చేసి ఈ సర్వీసును ప్రారంభించారు. మిగతా..2లో

### డీఎస్సీ కుంభకోణానికి సంబంధించిన ఆధారాలను ప్రజల ముందుకు తీసుకొస్తా




- మెగా డీఎస్సీ ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయన్న జగన్
- స్పోర్ట్స్ కోటా నిబంధనలను ఎందుకు మార్చారని ప్రశ్న
- జూడో ఆట కింద 39 మందికి ఉద్యోగాలు ఇచ్చారని విమర్శ

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని వైసీపీ అధినేత జగన్ మరోసారి ఆరోపించారు. తప్పులను కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని అన్నారు.

### ప్రజల అంచనాలకు తగ్గట్టు కలెక్టర్లు మారాలి..

## టెక్నాలజీ, ఏఐ వాడకం తప్పనిసరి

- 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- కొత్త తరం నాయకత్వ పద్ధతులు అలవర్చుకోవాలని కలెక్టర్లకు సూచన
- పరిపాలనలో ఏఐ, టెక్నాలజీ వినియోగంతో కచ్చితమైన ఫలితాలు సాధించాలని నిర్దేశం
- అధికారులు, నేతలకు విశ్వసనీయతే అత్యంత ప్రధానం అన్న సీఎం
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆలోచనా విధానం మార్చుకోవాలని పిలుపు



అమరావతి : ప్రజల ఆశలు, అంచనాలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని, కొత్త తరం నాయకత్వ పద్ధతులను (న్యూ ఏజ్ లీడర్షిప్) అలవర్చుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. పరిపాలనలో టెక్నాలజీని అందిపుచ్చుకుని, వేగవంతమైన ఫలితాలు సాధించడంపై దృష్టి పెట్టాలని ఆయన స్పష్టం చేశారు. గురువారం అమరావతిలో జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో "లీడర్షిప్ - న్యూ ఏజ్ గవర్నెన్స్" అనే అంశంపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, మిగతా..2లో

### కాకినాడ జిల్లాలో పులి సంచారం..

## రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్




- కాకినాడ జిల్లాలో పులి సంచారంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమీక్ష
- పులి కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులకు ఆదేశం
- అటవీ, పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచన
- ప్రజల భద్రతతో పాటు పులికి హాని జరగకుండా చూడాలని స్పష్టీకరణ

మొదటి పేజి తరువాయి

## ప్రజల అంచనాలకు తగ్గట్టు కలెక్టర్లు మారాలి..

# టెక్నాలజీ, ఏఐ వాడకం తప్పనిసరి

"గతంలో అనేక అంశాలపై దృష్టి సారించినా, ఇప్పుడు ప్రధానంగా నాయకత్వంపైనే ఆలోచించాలని నిర్ణయించాం. సరైన నాయకత్వంతోనే వేగంగా ఫలితాలు సాధించి, స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలను చేరుకోగలం. నాయకత్వం అనేది స్వీయ ప్రేరణ. ఈ విషయంలో మహిళలు, పురుషులు అనే వ్యత్యాసం చూడటం పాత కాలపు పద్ధతి" అని అన్నారు. ప్రస్తుతం నాయకత్వ మార్పు దశలో ఉన్నామని, అందరూ కొత్త నాయకత్వ పంథాను అనుసరించాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగ వ్యవస్థలు కూడా రూపాంతరం చెందుతున్నాయని, ఈ క్రమంలో అధికారులు, రాజకీయ నేతలకు విశ్వసనీయతే అత్యంత కీలకమని చంద్రబాబు నొక్కిచెప్పారు. నైపుణ్యాలకు నిరంతరం పదును పెట్టుకోవడం ద్వారానే వృత్తిలో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని వివరించారు. టెక్నాలజీ ప్రాధాన్యాన్ని వివరిస్తూ, "నేర్చుకోవడం అనేది నిరంతర ప్రక్రియగా మారాలి. ఆన్‌లైన్‌లో ఫైళ్ల నిర్వహణ, అవేర్, డేటా లేక్ వంటి సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా డేటాను విశ్లేషించుకుని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా కచ్చితమైన ఫలితాలు సాధించడంపై దృష్టి పెట్టాలి" అని ఆదేశించారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయ పారిశ్రామికవేత్తలు అత్యుత్తమంగా రాణిస్తున్నారని, ఏ వ్యవస్థలోనైనా ఇమిడిపోయే తత్వం భారతీయుల సొంతమని, ఆ స్ఫూర్తితో అధికారులు పనిచేయాలని ఆకాంక్షించారు.

## డీఎస్సీ కుంభకోణానికి సంబంధించిన ఆధారాలను ప్రజల ముందుకు తీసుకొస్తా

శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అసత్యాలు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. ఈ భారీ కుంభకోణానికి సంబంధించిన అన్ని ఆధారాలను త్వరలోనే సమగ్రంగా ప్రజల ముందుకు తీసుకొస్తానని స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఒకే ఒక్క వ్యక్తికి/సంస్థకు ఎలా అప్పగిస్తారని జగన్ ప్రశ్నించారు. ఎస్‌సీఈఆర్‌టీ విభాగంలో పనిచేస్తున్న నవీన్ అనే అభ్యర్థికి ఫస్ట్ ర్యాంక్ ఎలా వచ్చింది? అసలు మొదటి ర్యాంక్ సాధించిన నవీన్‌కు ఉద్యోగం ఎందుకు నిరాకరించారు? అని ప్రశ్నించారు. జీవో నంబర్ 4, జీవో నంబర్ 47లను తీసుకొచ్చి స్పోర్ట్స్ కోటా నిబంధనలను ఎందుకు మార్చారు? పరీక్షలు నిర్వహించకుండానే 372 మందికి నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు కట్టబెట్టడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? అని ప్రశ్నించారు. 'జూడో' అనే ఆట కింద ఏకంగా 39 మందికి అక్రమంగా సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. మెగా డీఎస్సీ అక్రమాలపై తమ పార్టీ ఆధారాలతో సహా నిలదీస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకు కోపం వచ్చి బీపీ పెరుగుతోందని, మంత్రి నారా లోకేశ్ ను కాపాడుకోవడానికి ప్రభుత్వం తాపత్రయపడుతోందని జగన్ ఎద్దేవా చేశారు. ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులు, జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

## కాకినాడ జిల్లాలో పులి సంచారం..

# రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్

అమరావతి : కాకినాడ జిల్లాలో పులి సంచారం స్థానికంగా ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రత్తిపాడు మండలం ధారపల్లి సమీపంలోని రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో పులి తిరుగుతున్న సమాచారంతో ఆయన అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పులి కదలికలు, ప్రస్తుత పరిస్థితి, దానిని పట్టుకునేందుకు అటవీ శాఖ తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. పులి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు అటవీ శాఖ, ప్రత్యేక 'హనుమాన్' బృందాలు నిరంతర నిఘా కొనసాగించాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. పులి జనావాసాల్లోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో అటవీ, పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాపిడ్ రెస్పాన్స్ బృందాలను సర్వసన్నద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తూ, వారికి భద్రతపై భరోసా కల్పించాలని అధికారులకు తెలిపారు. "ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. అదే సమయంలో, పులికి ఎలాంటి హాని కలగకుండా చూడటం కూడా మన బాధ్యత" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## తిరుపతివిజయవాడ మధ్య

# కొత్త విమాన సర్వీసు ప్రారంభం

తొలి ప్రయాణికులకు ఆయన స్వయంగా టికెట్లు అందజేశారు. వారంలో నాలుగు రోజుల పాటు తిరుపతివిజయవాడ మధ్య ఈ విమాన సర్వీసులు అందుబాటులో ఉంటాయని యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. కొత్త విమాన సర్వీసు అందుబాటులోకి రావడం ద్వారా విజయవాడ, తిరుపతి మధ్య ప్రయాణికులకు మరింత సౌకర్యం కలగనుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ.. 'కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడికి కృతజ్ఞతలు. ఆదివారం కూడా తిరుపతివిజయవాడ మధ్య విమాన సర్వీసు ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. గన్నవరం విమానాశ్రయం నుంచి ఎమిరేట్స్, ఖతర్, లుఫ్తాన్సా వంటి అంతర్జాతీయ విమాన సర్వీసులు కూడా అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉంది. గత 12 ఏళ్లలో గన్నవరం విమానాశ్రయం భారీగా అభివృద్ధి సాధించిందని, భవిష్యత్తులో మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది' అని అన్నారు.

## అంతరిక్షం అందరిదీ- బాధ్యత కూడా సమష్టిగా ఉండాలి

ఢిల్లీ : అంతరిక్ష రంగంలో భారత్ వైఖరిని మరోసారి స్పష్టం చేశారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. సురక్షితమైన, భద్రమైన, సుస్థిరమైన అంతరిక్ష వ్యవస్థకు భారత్ మద్దతు ఇస్తుందని తెలిపారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా అంతరిక్ష కార్యకలాపాలు కొనసాగాలని పేర్కొన్నారు. పారిస్‌లో జరుగుతున్న అంతర్జాతీయ స్పేస్ సమ్మిట్‌ను గురువారం వర్చువల్‌గా ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. అంతరిక్షం అందించే అవకాశాలకు హద్దులు లేవని, అయితే దానిపై మనందరి బాధ్యత ఉమ్మడిదేనని మోదీ పేర్కొన్నారు. భారత్ తదుపరి తరం అంతరిక్ష పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాల్లో ఫ్రాన్స్‌తో పాటు ఇతర దేశాలు భాగస్వాములు కావాలని మోదీ ఆహ్వానించారు.

## త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు : పొన్నం ప్రభాకర్

సంఘాల నేతలతో చర్చలు జరుగుతున్నాయని, కార్మిక సంఘాల ఎన్నికల తర్వాత ఆర్టీసీ వీలీన ప్రక్రియ ఉంటుందని తెలిపారు. ప్రభుత్వంలో విలీనమైనా ఏపీ ఆర్టీసీలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఆర్టీసీ స్థలం అందించామని పేర్కొన్నారు. 347.47 కోట్ల మంది మహిళలకు ఉచిత ప్రయాణం : హైదరాబాద్ నగరానికి వంద మినీ బస్సులు రాబోతున్నాయని మంత్రి ప్రకటించారు. వాటిలో 50 పాతబస్తీకి, మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానిస్తామని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద ఇప్పటివరకు 347.47 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం పొందగలిగారని, ఇదొక రికార్డ్ అని పొన్నం వెల్లడించారు. "ఆర్టీసీ ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాత కొత్త బస్టాండ్లు నిర్మిస్తాం. వంద మినీ బస్సులు రాబోతున్నాయి. పాతబస్తీకి 50 కేటాయిస్తాం. మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానం చేస్తాం. బస్టాండ్ల అభివృద్ధికి ఆర్థికంగా ఎమ్మెల్యేలు సహకరించాలి. 347.47కోట్ల మంది మహిళలు ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారు. మహిళలు రూ.12,171 కోట్ల విలువైన ఉచిత ప్రయాణం చేశారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఆర్టీసీ స్థలం అందించాం. కార్మిక సంఘాల ఎన్నికలను గత ప్రభుత్వం రద్దు చేసింది. కార్మిక సంఘాల ఎన్నికలపై సంఘాల నేతలతో చర్చలు జరుగుతున్నాయి. కార్మిక సంఘాల ఎన్నికల తర్వాత ఆర్టీసీ వీలీన ప్రక్రియ ఉంటుంది. ఆర్టీసీ విలీనమైన ఏపీలో అనేక సమస్యలు ఎదుర్కుంటున్నారు

## తుమ్మల నాగేశ్వరరావు పనితీరు, వ్యక్తిత్వంపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు



తప్పులేదని వారు స్పష్టం చేశారు. "మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు. ప్రజాప్రతినిధులుగా మేము కూడా ఇంతటి ఓపిక, జవాబుదారీతనం ఉన్న మంత్రిని గతంలో చూడలేదు" అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఏ సమస్యపై ఫోన్ చేసినా మంత్రి తుమ్మల వెంటనే స్పందిస్తారని... ఆదివారాలు లేదా సెలవు రోజుల్లో కూడా ప్రజా సమస్యలపై అందుబాటులో ఉంటారని తెలిపారు. సమీక్షలు లేదా పనుల్లో ఉండి ఫోన్ తీయలేకపోయినా, వీలైనంత త్వరగా తిరిగి ఆయనే కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు. ప్రజలు లేదా నియోజకవర్గాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళితే ఎంతో ఓపికతో విని, ఆ సమస్య పూర్తయ్యే వరకు అధికారులతో స్వయంగా మాట్లాడతారని పేర్కొన్నారు. పని ఏ దశలో ఉందో, ఎప్పుడు పరిష్కారమవుతుందో కూడా మళ్లీ తిరిగి ఫోన్ చేసి అప్‌డేట్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. శాసనసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు, తోటి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పాలనా సమర్థతను, ఓపికను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యేలు సూచించారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం - అనకాపల్లి జిల్లాలో దంచికొట్టిన వాన

మొదటి పేజి తరువాయి

రానున్న కొద్ది రోజుల పాటు వాతావరణం చల్లబడనుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంటకు 60 కి.మీ వేగంతో గాలులు : తీర ప్రాంతాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. బలమైన గాలుల కారణంగా తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సముద్ర తీరానికి వెళ్లొద్దని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. మత్స్యకారులకు 48 గంటల



హైఅలర్ట్ : సముద్రం అల్లకల్లోలంగా మారిన నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మత్స్యకారులకు అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. రానున్న 48 గంటల పాటు ఎవరూ చేపల వేటకు సముద్రంలోకి వెళ్లరాదని ఆదేశాలు ఇచ్చింది. సముద్రంలో అలల ఉద్ధృతి ఎక్కువగా ఉన్నందున చిన్న పడవలు, మరబోట్లు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సమాచార వ్యవస్థల ద్వారా సందేశాలు పంపుతున్నారు. తాజా వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, పోలీసు, మత్స్య శాఖల అధికారులను అప్రమత్తం చేసింది. విపత్తు నిర్వహణ సంస్థ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వాతావరణ మార్పులను పర్యవేక్షిస్తోంది.అనకాపల్లి జిల్లాలో దంచికొట్టిన వాన : అల్పపీడన ప్రభావంతో అనకాపల్లి జిల్లాలో వరుణుడు ప్రతాపం చూపాడు. జిల్లాలోని పాయకరావుపేట, నక్కపల్లి తదితర ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా వేసవి తాపంతో, ఉక్కపోతతో అల్లాడిపోతున్న స్థానిక ప్రజలను ఈ వర్షం పలకరించింది. వాన కారణంగా పలుచోట్ల ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

# భారత్ అమ్ములపొదిలో 190 అణు వార్‌హెడ్లు

మొదటి పేజి తరువాయి

భారత్ వేగంగా అభివృద్ధి చేస్తోందని హాన్స్ క్రిస్టెన్సెన్ పేర్కొన్నారు. 2026 ప్రారంభం నాటికి భారత్ వద్ద సుమారు 730 కిలోల వెపన్-గ్రేడ్ ప్లుటోనియం ఉన్నట్లు అంచనా వేశారు. ఒక్కో వార్‌హెడ్‌కు 4 కిలోల ప్లుటోనియం అవసరం అనుకున్నా ఈ నిల్వలు 140 నుంచి 225 వార్‌హెడ్ల తయారీకి సరిపోతాయని తెలిపారు. అయితే భారత్ తన వద్ద ఉన్న ప్లుటోనియం మొత్తాన్ని ఆయుధాల తయారీకే వాడకపోవచ్చని, కొంత రిజర్వ్‌గా ఉంచుకునే అవకాశం ఉందని హాన్స్ క్రిస్టెన్సెన్ కథనం పేర్కొంది. ఆయుధ సంపత్తిని పెంచుకున్నప్పటికీ భారత్ తన విధానాలకు కట్టుబడి ఉంది. 1998లో పోఖ్రాన్-×× అణుపరీక్షల తర్వాత భారత్ 'నో ఫస్ట్ యూజ్' సిద్ధాంతాన్ని ప్రకటించింది. తమ అణ్వాయుధాలు కేవలం శత్రు దేశాలను నిలువరించటానికి మాత్రమేనని పార్లమెంటులోనూ ప్రభుత్వం స్పష్టం చేసింది. కాగా, మరిన్ని కొత్త క్షిపణి వ్యవస్థలు అభివృద్ధి దశలో ఉన్నందున, రానున్న రోజుల్లో భారత్ అణ్వాయుధాల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.

### ఏఏ దేశాల వద్ద ఎన్ని ఉన్నాయంటే?

ఇదిలా ఉండగా, ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, యుద్ధాల నేపథ్యంలో ఇటీవలి కాలంలో అనేక దేశాలు తమ సైనిక సామర్థ్యాలను బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. ముఖ్యంగా అణుశక్తి కలిగిన దేశాలు తమ ఆయుధ సంపత్తిని మరింత మెరుగుపరుచుకుంటున్నాయి. అయితే, ప్రపంచంలో అత్యధిక అణ్వాయుధాలున్న దేశాలుగా అమెరికా, రష్యా ముందు వరుసలో ఉన్నాయి. ఈ మేరకు స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధన సంస్థ (సిప్రి) కొద్దిరోజుల క్రితం ఒక నివేదికలో వెల్లడించింది. రష్యా వద్ద 5,420, అమెరికా వద్ద 5,042 అణు వార్‌హెడ్లు ఉన్నాయని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా అణుశక్తి దేశాలు కలిగిన దేశాలు తొమ్మిది కాగా, వాటి వద్ద మొత్తంగా 12వేలకు పైగా అణ్వాయుధాలు ఉన్నట్లు వెల్లడించింది. ఈ జాబితాలో యూకే (225), ఫ్రాన్స్ (370), ఉత్తరకొరియా (60), ఇజ్రాయెల్ (90), దేశాలున్నాయి. ఇక భారత్ విషయానికొస్తే, అణ్వాయుధాల విషయంలో మన దేశం కూడా వేగంగా అడుగులు వేస్తోంది. ఈ ఏడాది జనవరి నాటికి భారత్ వద్ద 190 అణ్వాయుధాలు ఉన్నాయని, అది పాక్ కంటే ఎక్కువేనని సిప్రి నివేదించింది. ఏడాది వ్యవధిలో భారత్ 10 వార్‌హెడ్లను పెంచుకుందని నివేదికలో పేర్కొంది. అలాగే,



చైనా వద్ద 620 అణ్వాయుధాలు ఉన్నాయని పేర్కొంది. గతేడాదితో పోలిస్తే బీజింగ్ 20 అణు వార్‌హెడ్‌లను తన ఆయుధాగారంలోకి చేర్చుకుందని తెలిపింది. ఇక, ప్రపంచంలోనే అత్యధిక రక్షణ వ్యయం ఉన్న దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానంలో ఉంది. 2025లో భారత రక్షణ వ్యయం 92.1 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు సిప్రి నివేదిక వెల్లడించింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 8.9శాతం ఎక్కువ అని తెలుస్తోంది. ఇక, 2021-25 మధ్య ప్రపంచవ్యాప్తంగా రక్షణ దిగుమతుల్లో 8.2శాతం మన దేశానివే కావడం విశేషం.

# రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ 18వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనడానికి భారత్‌కు వస్తున్నారు.

మొదటి పేజి తరువాయి

ఆయన పాలనను వ్యతిరేకించే ప్రబలమైన శక్తి ఏదీ రష్యాలో లేదు. ఆయన కోరుకుంటే 2036 వరకు అధికారంలో కొనసాగగలరు. పుతిన్‌కు భారీ భద్రత ఉంటుంది. వందలాది మంది భద్రతాసిబ్బంది 24 గంటలూ ఆయనతోనే ఉంటూ పరిసరాలను నిశితంగా గమనిస్తూ ఉంటారు. పుతిన్ ఆహారాన్ని రహస్యంగా తయారు చేస్తారని, ఆయన తాగే ప్రతి పానీయాన్ని ముందుగా ఆయన అత్యంత సన్నిహిత సలహాదారులు తనిఖీ చేస్తారని బీబీసీ న్యూస్ రిపోర్ట్‌లో ఉంది. కేజీబీ మాజీ అధికారి అయిన పుతిన్‌కు తన చుట్టూ ఉన్న ప్రమాదాల గురించి బాగా తెలుసు. రష్యాలో అనేక భద్రతా సంస్థలు ఉన్నాయి. వాటిలో ఒక సంస్థ ప్రత్యేకంగా అధ్యక్షునికి, ఆయన కుటుంబానికి భద్రత కల్పించడానికే పనిచేస్తుంది. దీనిని రష్యన్ ప్రెసిడెన్షియల్ సెక్యూరిటీ సర్వీస్ లేదా ఎస్‌బీపీ అని పిలుస్తారు. ఇది రష్యా గూఢచార సంస్థ కేజీబీ నుంచి ఏర్పడిన రష్యా ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ (ఎఫ్ఎస్‌ఓ)కు రిపోర్ట్ చేస్తుంది. నల్ల సూట్లు ధరించి, చెవులకు ఇయర్‌ఫోన్లు పెట్టుకున్న ఎస్‌బీపీ గార్డులు 24గంటలూ పుతిన్‌తో పాటుంటారు.



"పుతిన్‌తో పాటు విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఈ ఏజెంట్లు 4 బృందాలుగా విడిపోయి, 4 భద్రతా వలయాలుగా ఏర్పడతారు" అని రష్యా ప్రభుత్వ యాజమాన్యంలోని మీడియా సంస్థ రష్యా బియాండ్ తెలిపింది. ఇందులో మొదటి బృందం అధ్యక్షుడి సమీపంలో ఉంటుంది. ఇందులో ఆయన వ్యక్తిగత గార్డులు ఉంటారు. రెండో వలయంలో ప్రజల దృష్టి పడకుండా ఉండేలా భద్రతా బృందాలను మోహరిస్తారు. మూడో వలయంలో ఉండే బృందం అనుమానాస్పద వ్యక్తులను గమనిస్తూ, వారు అధ్యక్షుడి వైపు రాకుండా అడ్డుకుంటుంది. చివరిదైనా నాలుగో భద్రతా వలయంలో ఉండే గార్డులు పరిసరాలలో భవనాలపై మోహరిస్తారు. రష్యన్ భద్రతా నిపుణుడు గలియోటి భద్రతా సమస్యలను విశ్లేషించే మాయక్ ఇంటెలిజెన్స్ అనే కన్సల్టింగ్ సంస్థకు డైరక్టర్‌గా ఉన్నారు. "పుతిన్‌కు హెలికాప్టర్లు ఇష్టం ఉండవు. ఆయన సాధారణంగా చాలా పెద్ద నల్ల కార్లు, మోటార్ సైకిళ్లపై ఉండే భద్రతా సిబ్బందితో కూడిన భారీ కాన్వాయ్‌లో ప్రయాణిస్తారు. ఆయన ప్రయాణించే సమయంలో కొన్నిసార్లు డ్రోన్లు ఎగరడంపై ఆంక్షలు విధిస్తారు. ట్రాఫిక్‌ను నిలిపివేస్తారు" అని బీబీసీ ముండోతో మార్క్ గలియోటి చెప్పారు. రష్యన్ ప్రెసిడెన్షియల్ (ఎస్‌బీపీ)కి రష్యన్ నేషనల్ గార్డ్ లేదా రోస్‌గ్వార్డియా మద్దతుగా ఉంటుంది. కొందరు దీనిని అధ్యక్షుని "వ్యక్తిగత సైన్యం"గా పిలుస్తారు. దీని అధికారిక విధుల్లో రష్యా సరిహద్దులను సురక్షితంగా ఉంచడం, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, ప్రజా శాంతిభద్రతలను పరిరక్షించడం వంటివి ఉన్నప్పటికీ ఇది రష్యా సాయుధ దళాలకు భిన్నమైన సంస్థ. వాస్తవానికి పుతిన్‌ను ప్రమాదాల నుంచి కాపాడటమే దీని అత్యంత ముఖ్యమైన పని. "రష్యన్ నేషనల్ గార్డ్ చాలా వరకు పుతిన్ వ్యక్తిగత భద్రత అని అందరికీ తెలుసు" అని యూకేలోని బాత్ విశ్వవిద్యాలయంలో రష్యా విద్యావేత్త స్టీఫెన్ హాల్ బీబీసీ ముండోతో అన్నారు.

# రూ.కోటి బీమా.. దేశంలోనే తొలిసారి

మొదటి పేజి తరువాయి

విమాన ప్రయాణ సమయంలో ప్రమాదం జరిగితే రూ.2 కోట్ల వరకు బీమా ప్రయోజనం కల్పిస్తున్నట్లు వెల్లడించించారు. సహజ మరణానికి రూ.10 లక్షల వరకు ప్రయోజనం కల్పించే వెసులుబాటు కూడా ఉన్నట్లు చెప్పారు.

### 12.91 లక్షల మందికి కవరేజీ

రాష్ట్రంలో మొత్తం 12,91,056 మంది ఈ పథకం పరిధిలో ఉన్నట్లు, వీరిలో 5,18,293 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నట్లు చెప్పారు. ఇంకా 5,00,158 మంది తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్, మల్టీపర్పస్ వర్కర్లు, కాంట్రాక్ట్, డైలీవేజ్, ఎన్ఆర్ఈజీఎస్, ఎంటీఎస్, సెర్ప్ తదితర సిబ్బంది ఉన్నారు. 2,72,600 మంది పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు ఉన్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి వివరించారు.

### సింగరేణితో శ్రీకారం

ఉద్యోగుల కోసం రూ.కోటి బీమా పథకానికి తొలుత సింగరేణి కాలరీస్‌లో శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ పరిధిలోని డిస్కమ్‌లు, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పథకాన్ని విస్తరించినట్లు చెప్పారు. చివరగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ వర్తించేలా విస్తరించినట్లు పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులకు 2024 ఫిబ్రవరిలో, ఇంధన శాఖ ఉద్యోగులకు 2025లో, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ 2026 జూన్ 25 నుంచి పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

### ప్రభుత్వానికి రూపాయి భారం లేదు

ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్న బ్యాంకులతో ప్రభుత్వం చర్చలు జరిపి ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగుల జీతాలు తమ బ్యాంకుల ద్వారా జమ అవుతున్నందున, బ్యాంకులకు వ్యాపారపరంగా ప్రయోజనం కలుగుతున్న నేపథ్యంలో బీమా పథకానికి బ్యాంకులే సహకరించేలా ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. దీంతో ప్రభుత్వంపై, ఉద్యోగులపై ఎలాంటి ప్రీమియం భారం లేకుండా పథకం అమలవుతోందన్నారు.

### ఇప్పటికే క్లెయిమ్‌ల పరిష్కారం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఇప్పటివరకు 33 క్లెయిమ్‌లు వచ్చాయని, వాటిలో 24 క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు తెలిపారు. విద్యుత్ శాఖకు చెందిన ఎస్పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్, టీజీ జెన్‌కో, ట్రాన్స్‌కో పరిధిలో 15 క్లెయిమ్‌లు రాగా అన్నింటినీ పరిష్కరించినట్లు చెప్పారు. ఈ విభాగంలో రూ.15 కోట్లకు పైగా చెల్లింపులు జరిగినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా సింగరేణి కాలరీస్‌లో 50 క్లెయిమ్‌లు రాగా అన్నింటిని పరిష్కరించినట్లు తెలిపారు.

### కేంద్రం, ఇతర రాష్ట్రాలు అధ్యయనం

రాష్ట్రంలో ప్రారంభించిన ప్రమాద బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేసిందని ఉప ముఖ్యమంత్రి సభకు చెప్పారు. ఇతర రాష్ట్రాలు సైతం తెలంగాణలో అమలు చేస్తున్న ఈ బీమా విధానాన్ని పరిశీలించేందుకు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. తమిళనాడు కూడా ఈ తరహా పథకాన్ని అమలు చేసినట్లు ఆయన



వెల్లడించారు.

### ఉద్యోగులకు హెల్త్‌కార్డు

బీమా పథకంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం హెల్త్‌కార్డు పథకాన్ని కూడా తీసుకొచ్చినట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. దశాబ్దాలుగా ఉద్యోగ సంఘాలు కోరుతున్న క్యాష్‌లెస్ వైద్య సేవల కలను ప్రభుత్వం సాకారం చేసిందని చెప్పారు. ఉద్యోగులు, వారి సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబంధిత ముఖ్య కార్యదర్శులతో కమిటీ ఏర్పాటు చేసి చర్చల అనంతరం హెల్త్‌కార్డుల విధానాన్ని ఖరారు చేసినట్లు వివరించారు. క్యాష్‌లెస్ వైద్యం, సీజీహెచ్ఎస్ ప్యాకేజీ వంటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. హెల్త్‌కార్డు పథకం కోసం ఇప్పటికే సుమారు రూ.240 కోట్ల నిధులు కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి బీమా, ఆరోగ్య భద్రతకు హెల్త్‌కార్డు, రెండు పథకాలూ ఉద్యోగ కుటుంబాలకు ఆర్థిక, వైద్య భరోసా కల్పించేలా రూపొందించామని ఉప ముఖ్యమంత్రి భట్టి శాసనసభకు చెప్పారు.

# బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వాదంపై స్పందించిన మంత్రి శ్రీధర్

**బాబు - బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరుపై ఆగ్రహం - తాతా మధు వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎందుకు ఖండించడం లేదని ప్రశ్న**

హైదరాబాద్ : బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వాదంపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ పోలీసులపై ఎన్నడు ఇలాంటి ఘటనలు జరగలేదనన్న మంత్రి శ్రీధర్ బాబు, పోలీస్ సిబ్బందిని గొంతు పిసుకుతున్నట్లు కనిపించిందని తెలిపారు. సీనియర్ శాసనసభ్యుడిగా ఉన్న వ్యక్తి పోలీసులపై దాడి చేశారని, ఓ శాసనసభ్యుడు యూనిఫామ్‌లో ఉన్న పోలీస్ కాలర్ పట్టుకున్నారని ఆరోపించారు. పోలీసులపై దాడి చేయడాన్ని మీడియా ఛానళ్లలో స్పష్టంగా కనిపించిందని, పోలీసులపై కేటీఆర్ చేయి చేసుకున్నట్లు కనబడుతోందని వెల్లడించారు. పోలీసులపై దాడి చేస్తే అధికారంలోకి వస్తామని తామెప్పుడూ అనుకోలేదని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు హుందాగా ప్రవర్తించాలని హితువు పలికారు. ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుంది : బీఆర్ఎస్ సభ్యుల తీరు చాలా దారుణంగా ఉందన్న మంత్రి బ్యాడ్జీలు తీసుకురాకూడదని గత బీఆర్ఎస్ ప్రభుత్వమే రూల్స్ రూపొందించిందని, టీషర్టుపై నినాదాలు ఉంటే అనుమతించకూడదని నిబంధన ఉందని గుర్తు చేశారు. సభా గౌరవాన్ని తగ్గించేలా బీఆర్ఎస్ సభ్యులు టీషర్టులపై నినాదాలు ఉన్నాయని మండిపడ్డారు. రూల్స్‌కు అనుగుణంగానే స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని స్పష్టం చేశారు. రాహుల్‌కు ఒక న్యాయం, మాకో న్యాయమా అంటూ కేటీఆర్ అంటున్నారని, రాహుల్ టీషర్టుపై ఏదీ రాసుకొని లోక్‌సభకు వెళ్లలేదని తెలిపారు. గతంలో ప్లకార్డులు అనుమతించరని చెబితే తాము తీసుకెళ్లలేదని గుర్తు చేశారు. మహిళా సభ్యులకు ఇబ్బంది జరిగిందని తెలియగానే సీఎం సమీక్ష చేశారని, ఏవైనా లోటుపాట్లు జరిగితే ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎందుకు ఖండించదు : స్పీకర్‌పై అంత ఘోరమైన భాష ఉపయోగించడం సరికాదని హితవు పలికారు. తాతా మధు సభ్య సమాజం అసహ్యించుకునే భాష మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్పందించాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉందని, కేసీఆర్ స్పందించకుంటే ఆయనే ప్రేరేపించారన్న అనుమానాలు వస్తాయని తెలిపారు. తాతా మధు వ్యాఖ్యలకు బీఆర్ఎస్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తాతా మధు వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎందుకు ఖండించదని ప్రశ్నించారు. క్షమాపణ చెప్పాకే మిగతా కార్యకలాపాలు : స్పీకర్ తల్లిని దూషించేలా వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసం మంత్రి మండిపడ్డారు. దళిత వ్యతిరేక పార్టీగా బీఆర్ఎస్ నిరూపించుకుంటుందని, తాతా మధు వ్యాఖ్యలు విని స్పీకర్ కన్నీరు పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ పోలీసులను బెదిరిస్తున్నారని, శాసనసభను దుశ్శాసన సభ అని కేటీఆర్ అవమానించారని, మహిళల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదని తెలిపారు. మహిళా మంత్రి లేకుండా ఐదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నడిపిందని విమర్శించారు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెడతామని కేటీఆర్ బెదిరిస్తున్నారని, వారి బెదిరింపులకు కాంగ్రెస్ భయపడే ప్రసక్తి లేదని స్పషం చేశారు. వారు స్పీకర్‌కు క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. వారు స్పీకర్‌కు క్షమాపణ చెప్పాకే మిగతా కార్యకలాపాలు ఉంటాయని, తప్పు జరిగిందని ఒప్పుకునే మనస్సు ఉండాలని వెల్లడించారు. "ఓ శాసనసభ్యుడు యూనిఫామ్‌లో ఉన్న పోలీస్ కాలర్ పట్టుకున్నారు. పోలీసులపై దాడి చేయడాన్ని మీడియా ఛానళ్లలో స్పష్టంగా కనిపించింది. పోలీసులపై కేటీఆర్ చేయి చేసుకున్నట్లు కనపడింది. పోలీసులపై దాడి చేస్తే అధికారంలోకి వస్తామని మేము ఎప్పుడూ అనుకోలేదు. పోలీస్ సిబ్బందిని గొంతు పిసుకుతున్నట్లు కనిపించింది. ఉమ్మడి రాష్ట్రంలోనూ పోలీసులపై ఇలాంటి ఘటనలు జరగలేదు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెడతామని కేటీఆర్ బెదిరిస్తున్నారు. వారి బెదిరింపులకు కాంగ్రెస్ భయపడే ప్రసక్తే లేదు




# చీకట్లో సోమశిల సమాధానం చెప్పేదెవరు?

**-తరచూ విద్యుత్ కోతలతో ప్రజల అవస్థలు**
**-5--6 గంటల పాటు కరెంట్ లేక ఇబ్బందులు**
**- హెవీ లోడ్ కారణమంటున్న అధికారులు..**
**శాశ్వత పరిష్కారం కోరుతున్న ప్రజలు**

అనంతసాగరం 10 సెప్టెంబర్ ప్రజాన్యూస్ నెట్ వర్క్ :
నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం సోమశిల గ్రామంలో తరచూ జరుగుతున్న విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగటి సమయంలో ఉక్కపోతకు చిన్నారులు, వృద్ధులు అల్లాడిపోతుండగా, రాత్రి వేళ ప్రశాంతంగా నిద్రపోవాలన్నా కరెంట్ కోతలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారి విద్యుత్ సరఫరా నిలిచిపోతే సుమారు 5 నుంచి 6 గంటల వరకు కరెంట్ రాకపోవడంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని చెబుతున్నారు. ఈ విషయంపై ఏ ఈ ని వివరణ కోరగా అనంతసాగరం మండలం నుంచి ఉదయగిరి వరకు విద్యుత్ లైన్‌పై హెవీ లోడ్ ఏర్పడటంతో పైస్థాయి నుంచి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అయితే కారణం ఏదైనా గంటల తరబడి విద్యుత్ లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులదేనని గ్రామస్తులు అంటున్నారు. విద్యుత్ కోతల కారణంగా చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రాత్రి వేళల్లో భద్రతాపరమైన సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిశీలించి, తరచూ జరుగుతున్న విద్యుత్ కోతలకు శాశ్వత పరిష్కారం చూపాలని సోమశిల గ్రామ ప్రజలు కోరుతున్నారు

# న్యాయవాద వృత్తిలో ప్రతిభకు కాళోజి నంది అవార్డు

**యరగాని సోనీకి అభినందనల వెల్లువ.. యువ న్యాయవాదిగా ప్రతిభకు గుర్తింపు**



(హుజూర్‌నగర్ మండల), సెప్టెంబర్ 10, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన యువ న్యాయవాది, నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యురాలు యరగాని సోనీ ప్రతిష్టాత్మక కాళోజి నంది అవార్డును అందుకున్నారు. కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని కాళోజి తెలంగాణ జూనియర్ లేడీ అడ్వకేట్ అసోసియేషన్, కాళోజి తెలంగాణ జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. జూనియర్ న్యాయవాదిగా సోనీ కనబరిచిన ప్రతిభ, వృత్తిపట్ల అంకితభావాన్ని గుర్తించి కమిటీ ఆమెను అవార్డుకు ఎంపిక చేసింది. అవార్డు అందుకున్న సోనీని తల్లిదండ్రులు యరగాని సత్యనారాయణ గౌడ్, ఉమా, కుటుంబ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు. న్యాయవాద వృత్తిలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

# వినాయక ఉత్సవాలపై నేరేడుచర్ల ఎస్ఐ గోపాల్‌రెడ్డి కీలక సూచనలు

**-వినాయక మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి..**
**ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలి**



(నేరేడుచర్ల మండల), సెప్టెంబర్ 10, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :నేరేడుచర్ల మండలంలో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించాలని ఎస్ఐ గోపాల్‌రెడ్డి సూచించారు. వినాయక మండపాల నిర్వాహకులు ముందస్తు అనుమతులు తీసుకోవడంతో పాటు పోలీసులకు అవసరమైన వివరాలను అందజేయాలని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా మండపాల ఏర్పాట్లు చేపట్టాలని, శబ్ద కాలుష్య నిబంధనలు పాటించాలని సూచించారు. యువత, నిర్వాహకులు పోలీసులకు సహకరించి పండుగను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించాలని ఎస్ఐ గోపాల్‌రెడ్డి కోరారు.

# జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ కు మట్టి వినాయక విగ్రహం అందజేత

**సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ కు బీఆర్ఎస్‌వీ నాయకులు అఖిల్ మర్యాదపూర్వకంగా కలిసి మట్టి వినాయక విగ్రహాన్ని అందజేశారు.**



(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ సెప్టెంబర్ 10
పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలని, ప్రజలు కూడా మట్టి విగ్రహాలనే వినియోగించి పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించాలని వారు సూచించారు.మట్టి వినాయక విగ్రహాల వినియోగంతో నీటి కాలుష్యాన్ని నివారించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని అఖిల్ పేర్కొన్నారు. .ఈ సందర్భంగా ఎస్పీ మట్టి వినాయక విగ్రహాన్ని స్వీకరించి, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను అభినందించారు.కార్యక్రమంలో అసద్,అద్నాన్, సబీల్ తదితరులు ఉన్నారు

# రెండేళ్లుగా అద్దె బకాయిలు.. తహసీల్దార్ కార్యాలయానికి తాళం

**-అద్దె చెల్లించలేదంటూ కార్యాలయానికి తాళం వేసిన ఇంటి యజమాని జనార్ధన్ రెడ్డి**



(పాలకవీడు మండల), సెప్టెంబర్ 10, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధిపాలకవీడు తహసీల్దార్ కార్యాలయానికి ఇంటి యజమాని జనార్ధన్ రెడ్డి తాళం వేశారు. కార్యాలయం ఉన్న భవనానికి సంబంధించి రెండేళ్లుగా అద్దె బకాయిలు చెల్లించలేదని ఆరోపిస్తూ ఈ చర్యకు దిగినట్లు సమాచారం. అద్దె బకాయిలను చెల్లించకపోవడంతో కార్యాలయానికి తాళం వేసినట్లు ఇంటి యజమాని పేర్కొన్నారు. దీంతో కార్యాలయానికి వచ్చిన అధికారులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిసింది. విషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# వినాయక ఉత్సవాలపై గుర్రంపోడు ఎస్ఐ వెంకన్న గౌడ్ కీలక సూచనలు

**-వినాయక మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి..**
**ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలి**



(సెప్టెంబర్ 10, ప్రజా న్యూస్ నెట్‌వర్క్ గుర్రంపోడు ప్రతినిధి :గుర్రంపోడు మండలంలో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించాలని ఎస్ఐ వెంకన్న గౌడ్ సూచించారు. వినాయక మండపాల నిర్వాహకులు ముందస్తు అనుమతులు తీసుకోవడంతో పాటు పోలీసులకు అవసరమైన వివరాలను అందజేయాలని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా మండపాల ఏర్పాట్లు చేపట్టాలని, శబ్ద కాలుష్య నిబంధనలు పాటించాలని సూచించారు. యువత, నిర్వాహకులు పోలీసులకు సహకరించి పండుగను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించాలని ఎస్ఐ వెంకన్న గౌడ్ కోరారు.

# సంగారెడ్డి ట్రాఫిక్ ఏ. సత్యయ్య గారి చేతుల మీదుగా NGF 132 -- Sampark.me బ్రోచర్ & QR Sticker ఆవిష్కరించారు.



(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ సెప్టెంబర్ 10
వాహనానికి సంబంధించిన అత్యవసర సమాచారం మరియు కమ్యూనికేషన్‌ను సులభతరం చేసే ఈ స్మార్ట్ ఞ= స్టికర్ ద్వారా చీశీ పార్కింగ్ అలెర్ట్, ఎమర్జెన్సీ కాంటాక్ట్, కి అలెర్ట్, టోవింగ్ అలెర్ట్, డోర్/విండో అలెర్ట్, వెహికల్ లొకేషన్ డిటెక్షన్ వంటి సదుపాయాలతో పాటు వాహన యజమాని మొబైల్ నంబర్ ప్రైవసీని కాపాడుకోవచ్చు.కార్లు, బైకులు, స్కూటర్లు, ఆటోలు, కమర్షియల్ వాహనాలకు ఉపయోగపడే NGF 132 QR స్టిక్కర్ ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం ద్వారా రోడ్డు భద్రత మరియు అత్యవసర కమ్యూనికేషన్‌పై అవగాహన పెంచవచ్చని NGF 132 తెలంగాణ ౘ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిస్ట్రిబ్యూటర్ సిబ్బంది తెలిపారు.

# చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణుల నివాళులు



(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ సెప్టెంబర్ 10
తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ శ్రేణులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. భూస్వామ్య, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన ఐలమ్మ ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఆమె త్యాగాలను స్మరించుకుంటూ ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో చింత సాయినాథ్, విజేందర్ రెడ్డి, వేణుగోపాలస్వామి, కౌన్సిలర్లు పొన్న రాజేందర్ రెడ్డి, లాడే మల్లేశం, నవీన్, నాయకులు విఠల్, కసిని శ్రీకాంత్, విష్ణువర్ధన్, మోహన్, అజీమ్, శ్రవణ్ రెడ్డి, లాడే బాలు, శరత్, రవి, సంగమేష్, ఆంజనేయులు, గురు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు

# అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన బీఆర్ఎస్ యువ నాయకుల అరెస్టు



(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ సెప్టెంబర్ 10
అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ నిర్వహించనున్న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన బీఆర్ఎస్ యువ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు.ప్రతిపక్ష ఎమ్మెల్యేల గొంతును అణచివేసే విధంగా ప్రభుత్వం వ్యవహరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడం, ప్రజల గొంతును వినిపించడం ప్రతిపక్షాలకు ఉన్న ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్నారు.ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపేందుకు, అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధమైన తమను ముందస్తుగా అరెస్ట్ చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.ప్రతిపక్ష గొంతును అణచివేయడం ద్వారా ప్రజల సమస్యలను మరుగునపెట్టలేరని, బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువత నాయకులు శ్రవణ్ రెడ్డి, 9వ వార్డు బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ లాడే బాలు, చిన్నా తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరు స్వర్ణాలతో పాయకరావుపేట మహిళా కానిస్టేబుల్ విజయ సత్తా

**రాష్ట్ర స్థాయి పోటీల్లో పరుగులు, రిలే, కబడ్డీ, కోకో విభాగాల్లో ప్రథమ స్థానాలు**




పాయకరావుపేట, సెప్టెంబర్ 6 ప్రజా న్యూస్ నెట్వర్క్:
అనకాపల్లి జిల్లా పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వి. విజయ రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో ప్రతిభ చాటారు. అమరావతిలో సెప్టెంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు జరిగిన పోటీల్లో వివిధ ఈవిభాగాల్లో ప్రథమ స్థానాలు సాధించి ఆరు స్వర్ణ పతకాలను సొంతం చేసుకున్నారు.5000 మీటర్లు, 1500 మీటర్లు, 800 మీటర్ల పరుగులతో పాటు 4 ఐ 400 మీటర్ల రిలేలో విజయ మొదటి స్థానంలో నిలిచారు. అలాగే కబడ్డీ, కోకో విభాగాల్లోనూ ప్రథమ స్థానం సాధించారు.పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూనే క్రీడా పోటీల్లో పాల్గొని విజయ ఈ ఫలితాన్ని సాధించారు. వ్యక్తిగత విభాగాలైన పరుగులతో పాటు రిలే, కబడ్డీ, కోకో వంటి జట్టు క్రీడల్లోనూ ప్రథమ స్థానాలు సాధించడం ఆమె క్రీడా ప్రతిభను చాటింది.క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన, ఆత్మవిశ్వాసంతో విజయ ఈ విజయాన్ని సాధించినట్లు కథనంలో పేర్కొన్నారు.

# తెలంగాణ ఎన్ స్ యూ ఐ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా పృద్విరాజ్



## అంచెలంచెలుగా ఎదిగిన యువ నాయకుడు.. కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర

కుత్బుల్లాపూర్ :సెప్టెంబర్. 10 ప్రజా న్యూస్ నెట్వర్క్ ... రాజకీయాల్లో పదవులు రావడం కంటే ప్రజల్లో ఉంటూ, పార్టీ కోసం కష్టపడుతూ గుర్తింపు తెచ్చుకోవడం ఎంతో ముఖ్యమని నిరూపిస్తున్నారు యువ నాయకుడు పృద్విరాజ్. యువజన నాయకుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన.. అంచెలంచెలుగా ఎదుగుతూ తాజాగా తెలంగాణ రాష్ట్ర ఎన్ స్ యూ ఐ జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు.

విద్యార్థులు, యువత సమస్యలను ముందుకు తీసుకెళ్లడంలో చురుకైన పాత్ర పోషిస్తూ.. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో నిరంతరం పాల్గొంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పృద్విరాజ్‌కు ఈ బాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

**యువత సమస్యలపై పోరాటం**

యువజన నాయకుడిగా ఉన్న సమయంలోనే విద్యార్థులు, నిరుద్యోగులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై పృద్విరాజ్ గళమెత్తినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రజా సమస్యలపై స్పందిస్తూ, పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో ముందుండి పాల్గొంటూ నాయకత్వ లక్షణాలను ప్రదర్శించారు.

కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వంపై నమ్మకంతో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ కార్యకర్తలతో సన్నిహితంగా మెలిగిన పృద్విరాజ్.. క్రమంగా పార్టీ నాయకత్వం దృష్టిని ఆకర్షించారు.

**కాంగ్రెస్‌లో క్రియాశీలక పాత్ర**

కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు, సమావేశాలు, నిరసనలు, యువజన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తూ వచ్చారు. ముఖ్యంగా యువతను కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షించేందుకు కృషి చేస్తూ.. పార్టీ కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగారు.

కష్టపడి పనిచేసే కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు ఉంటుందనే దానికి పృద్విరాజ్ రాజకీయ ప్రస్థానం ఒక ఉదాహరణగా నిలుస్తుందని ఆయన అనుచరులు చెబుతున్నారు.

**రాష్ట్ర ఎన్ స్ యూ ఐ జనరల్ సెక్రటరీగా కొత్త బాధ్యత**

ఈ క్రమంలోనే పృద్విరాజ్‌ను తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యూ ఐ జనరల్ సెక్రటరీగా నియమించడం ఆయన రాజకీయ ప్రస్థానంలో మరో కీలక మైలురాయిగా నిలిచింది. యువజన నాయకుడిగా ప్రారంభమైన ప్రస్థానం.. ఇప్పుడు రాష్ట్ర స్థాయి బాధ్యత వరకు చేరుకోవడం పట్ల ఆయన అనుచరులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభినందనలు తెలియజేస్తున్నారు.

కొత్త బాధ్యతలతో తెలంగాణలో విద్యార్థులు, యువత సమస్యలను మరింత బలంగా ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ఎన్ స్ యూ ఐ ని మరింత బలోపేతం చేసేందుకు పృద్విరాజ్ కృషి చేయాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షిస్తున్నాయి.

**అంచెలంచెలుగా ఎదుగుతున్న యువ నాయకత్వం**

యువజన నాయకుడిగా మొదలైన పృద్విరాజ్ ప్రస్థానం.. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా చురుకైన పాత్ర.. పార్టీ కార్యక్రమాల్లో నిరంతర భాగస్వామ్యం.. చివరకు తెలంగాణ ఎన్ స్ యూ ఐ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టే స్థాయికి చేరుకోవడం యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు.

రాజకీయాల్లో పదవి కోసం ఎదురుచూడకుండా.. పార్టీ కోసం పనిచేస్తూ, ప్రజల్లో ఉంటూ ముందుకు సాగితే గుర్తింపు తప్పకుండా వస్తుందనే నమ్మకంతో పృద్విరాజ్ తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు.

---

# ప్రజా నాయకుడు.. జనహృదయ నేత చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

**ప్రజల కష్టాల్లో అండగా నిలిచే మహా నాయకుడ సేవా కార్యక్రమాలతో జన్మదిన వేడుకలు**

**ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దుస్తుల పంపిణీ**

**సేవా కార్యక్రమాలతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న సిజీఆర్-గుమ్మడిదల మండల ము**







కుత్బుల్లాపూర్. సెప్టెంబర్.10 ప్రజా న్యూస్ నెట్వర్క్. ..పదవి ఉన్నా లేకపోయినా నిత్యం జనం మధ్యనే ఉంటూ, నిరుపేదల కష్టాల్లో అండగా నిలిచే నాయకుడే నిజమైన ప్రజాప్రతినిధి. ఆ మాటను ప్రతిక్షణం నిరూపిస్తూ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న జనహృదయ నేత, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి. తన జన్మదిన వేడుకలను పేద విద్యార్థుల కళ్లల్లో ఆనందం నింపే సేవా కార్యక్రమంతో నిర్వహించారు.గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగివున్న క్రీడా ప్రతిభకు పదును పెట్టాలనే సంకల్పంతో సీజీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గుమ్మడిదలలో 136 మంది, అనంతారంలో 63 మంది, కానుకుంటలో 140 మంది చొప్పున మొత్తం 339 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా క్రీడా దుస్తులను అందజేశారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరుతీసుకురావాలన్నదే సీజీఆర్ ఆశయమని నాయకులు తెలిపారు.ప్రజల కష్టాల్లో అండగా నిలుస్తూ, అవసరమైన సమయంలో ఆపన్నులకు సహాయం అందించే నాయకుడిగా చిమ్ముల గోవర్ధన్ రెడ్డికి నియోజకవర్గంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆలయాల నిర్మాణం నుంచి ఉచిత తాగునీటి సరఫరా వరకు, పేద విద్యార్థుల చదువుల నుంచి అత్యవసర సహాయం వరకు ఏ కష్టం వచ్చినా "నేనున్నా" అంటూ భరోసా కల్పిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారు. ప్రజా సేవకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న గోవర్ధన్ రెడ్డి మరెన్నో పుట్టినరోజులు జరుపుకుని, నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని గుమ్మడిదల ప్రజలు, ప్రజాప్రతినిధులు మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య, సీజీఆర్ ట్రస్ట్ వైస్ చైర్మన్ చిమ్ముల నరేందర్ రెడ్డి, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏ. కృష్ణ, సర్పంచ్ కొమ్ము శ్రీనుతో పాటు నాయకులు చిమ్ముల దేవేందర్ రెడ్డి, యాదిరెడ్డి, నక్క వెంకటేష్ గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, సదానంద రెడ్డి, సూర్యనారాయణ, గోపాల్, భాస్కర్, జయపాల్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మోసిన్, కాంతారావు, రాజు, పోచయ్య, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తాడేపల్లి లో జరిగిన జనసేన పార్టీ స్థానిక ఎన్నికల అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న... కమిటీ సభ్యులు...




విశాఖపట్నం సెప్టెంబర్ 10 : ప్రజా న్యూస్ నెట్వర్క్, విశాఖపట్నం స్టాపర్ రిపోర్టర్, పీ.ఎం. నాయుడు.

తాడేపల్లి, విజయవాడ లో అన్నపూర్ణ కన్వెన్షన్ హాల్లో బుధవారం జరిగిన జనసేన పార్టీ స్థానిక ఎన్నికల అవగాహన కార్యక్రమంలో విశాఖ, అనకాపల్లి పార్లమెంట్ దానికి ఎన్నికల కమిటీ సభ్యులు పాల్గొన్నారు, జనసేన పార్టీ వ్యవస్థాపకులు మరియు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ మరియు పౌరుసేవ సరఫరా మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ పరిరక్షణలో నిర్వహించారు, నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. జనసేన పార్టీ కి కష్టపడి పనిచేసి ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన వారికి, ప్రజా సేవా కార్యక్రమాలు చేసిన వారికి గుర్తించి స్థానిక ఎన్నికల్లో సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు, పార్టీ లో ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్న వారిని దూరం ఉంచుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం మరియు అనకాపల్లి పార్లమెంట్ స్థానిక ఎన్నికల కోఆర్డినేటర్ గా చెల్లి బోయిన వంశీకృష్ణ యాదవ్ , కో ఆర్డినేషన్ టీం: పంచకర్ల సందీప్, పసుపులేటి ఉషాకిరణ్, వనంరెడ్డి సతీష్ కుమార్ , పి వి ఎస్ ఎన్ రాజు, గడ్డం బుజ్జి , అద్దేపల్లి సౌజన్య , సపోర్టింగ్ టీమ్: శివా దేవర, గవర సోమశేఖర రావు , మల్లు వలస శ్రీను , భోగిల శ్రీనివాస్ పట్నాయక్, నీరుకొండ దివాకర్, గరికిన రవి , దుంగ దేవన్ రాజు కోసిరెడ్డి త్రినాథ్, ఎన్ రమాదేవి నాయుడు, కోమర హేమంత్, సళ్ళదుల ప్రసాద్, దేవవరపు రాజ, కర్ణం అప్పారావు , ఎం త్రివేణి పాల్గొన్నారు.

# దళిత బాంధవుడు కె సి ఆర్

## -బిఆర్ఎస్ నాయకులు చదిరం నాగేశ్వర్



ఎల్కతుర్తి సెప్టెంబర్ 10 (ప్రజా న్యూస్ నెట్వర్క్ దినపత్రిక):

దళిత బంధు పథకం ద్వారా పది లక్షల రూపాయలను వారు ఎదుగుదలకు కొన్ని వేల కుటుంబాలకు అందించిన గొప్ప దర్శనికుడు దళితుల బాంధవుడు కల్వకుంట్ల చంద్రశేకర్ రావు అని బిఆర్ఎస్ నాయకులు చదిరం నాగేశ్వరరావు పేర్కొన్నారు ఎల్కతుర్తి లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద 125 అడుగుల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహాన్ని 145 కోట్ల రూపాయలు వెచ్చించి తెలంగాణ రాష్ట్ర రాజధాని నడిబొడ్డున హైదరాబాదులో నిర్మించడం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి దక్కిందని పేర్కొన్నారురాష్ట్ర సచివాలయాన్ని గొప్పగా నిర్మించి దానికి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి పేరు నామకరణం చేయడం కేసీఆర్ గారి గొప్పతనం అని పేర్కొన్నారు ఇలాంటి గొప్ప నాయకుని మీద ఆయన చావుని కోరుకుని అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను హత్య చేయలని ఉద్దేశంతో వారి ఇంటికి కొన్ని వేల మందిని ఉసి కోల్పడం హేయమైన చర్య అని దీనికి తీవ్రంగా ఖండిస్తున్నాం125 అడుగుల అతిపెద్ద అంబేద్కర్ గారి విగ్రహం కేసీఆర్ గారు నిర్మిస్తే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు అయినా కూడా ఇప్పటివరకు అధికారికంగా ఒక కార్యక్రమం చేసింది లేదు కనీసం ముఖ్యమంత్రి హోదాలో ఒక దండ కూడా ఇప్పటివరకు అంబేద్కర్ గారి 125 అడుగుల విగ్రహానికి వేసింది లేదు వీరికి దళిత సమాజం గూర్చి మాట్లాడే నైతిక హక్కు లేదు అని విమర్శిస్తున్నారు

దళితులను పావుగా వాడుతూ కేసీఆర్ గారు బ్రతికి ఉండంగానే వారి ఇంటి ముందు దళితులచే చావు డబ్బులు కొట్టించడం తీవ్ర నేరమైన చర్య హేయమైన చర్య దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం అమాయకమైన దళితులను ముందు పెట్టి చట్ట వ్యతిరేక కార్యక్రమాలను ఉసి కోల్పడాన్ని చూస్తూ ఊరుకునేది లేదు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇలాంటి నీచ సంస్కృతి చర్యలు మానుకోవాలని లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళితులను ఏకం చేస్తూ ఉవ్వెత్తున ఉద్యమిస్తూ మీ అధికారాన్ని దించేదాకా పోరాడుతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జూపాక జడ్సన్ ఆరేపల్లి రాజయ్య బిఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు బొంకూరి కార్తీక్ శనిగరం వంశీ తదితరులు పాల్గొన్నారు

# గుర్రంపోడు మండలంలో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి



గుర్రంపోడు సెప్టెంబర్ 10( ప్రజా న్యూస్ నెట్వర్క్ గుర్రంపోడు ప్రతినిధి)

గుర్రంపోడు మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ 41వర్ధంతి వేడుకలను మండల రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం రజాకారులపై పోరాటం చేసిన తెలంగాణ వీర వనిత ఐలమ్మ అని కొనియాడారు. వర్ధంతి సందర్భంగా బూసి రెడ్డి ఫౌండేషన్ వారి సౌజన్యంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో గుర్రంపోడు రజక సంఘం నాయకులు అయితరాజు నాగరాజు, పోలేపల్లి భద్రయ్య, ముష్టిపల్లి ఆంజనేయులు, పోలేపల్లి వెంకటయ్య, పోలేపల్లి నరసింహ, పోలేపల్లి రమేష్, పగిళ్ల శ్రీను, దుర్గారావు, మహేష్, జిపిఓ శ్రీనివాసులు, మదేల్ యాదయ్య, పోలేపల్లి అంజయ్య, ముష్టిపల్లి లింగస్వామి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గుప్త నిధుల కోసం అక్రమ తవ్వకాలు.. 8 మంది అరెస్ట్

## -పురాతన ఆలయ పరిసరాల్లో తవ్వకాలు.. మెటల్ డిటెక్టర్, స్కానర్, లొకేటర్ స్వాధీనం

(చివ్వెంల మండల), సెప్టెంబర్ 10, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :చివ్వెంల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉండ్రుగొండ గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పురాతన ఆలయాల పరిసర ప్రాంతాల్లో గుప్త నిధుల కోసం అక్రమంగా తవ్వకాలకు ప్రయత్నించిన 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. సెప్టెంబర్ 6న తెల్లవారుజామున కేషరాజు కుంట కట్ట వద్ద అనుమానాస్పదంగా తవ్వకాలు చేస్తున్న వ్యక్తులను గుర్తించిన పోలీసులు అక్కడి నుంచి మెటల్ డిటెక్టర్, స్కానర్, లొకేటర్, 6 సెల్‌ఫోన్లు, ఒక ట్యాబ్, డ్యూయట్ స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. దేవాలయ ఛైర్మన్ చకిలం కృష్ణ కుమార్ ఫిర్యాదు మేరకు చివ్వెంల ఎస్ఐ వి. మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సూర్యాపేట రూరల్ సీఐ జి. రాజశేఖర్ ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగిస్తూ పచ్చిపాల మధు, యల్లాల శ్రీకాంత్, భూతరాజు శివ, నకిరేకంటి గోపి, చర్లపల్లి ప్రణయ్ కుమార్, రాపాని తిరుపయ్య, కడారి సైదులు, భూక్యా తులశ్యలను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. గుప్త నిధుల పేరుతో జరిగే మోసాలను ప్రజలు నమ్మవద్దని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

